క్లుప్తంగా

నల్లతామర పురుగు నివారణకు చర్యలు చేపట్టండి

సూచించిన ఉద్యాన శాఖ అధికారులు

బొల్లాపల్లి : మండలంలోని మన్నేపల్లి తండా, రావులాపురం, రేమిడిచర్ల గ్రామాలను వినుకొండ ఉద్యాన అధికారి షేక్ నబీరసూల్, పల్నాడు జిల్లా వనరుల కేంద్రం శిక్షణ కోఆర్డినేటర్ ఎం.శివకుమారి సందర్శించి మిరప పంట పొలాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా శిక్షణ కోఆర్డినేటర్, ఉద్యాన శాఖ అధికారి మాట్లాడుతూ మిరప పంటలో నల్లి తామర పురుగు ఉధృతి ఎక్కువగా ఉండటం వల్ల రైతులు బ్రోఫ్లోనిలిడే మందును 35ఎం.ఎల్.నీటిలో కలిపి ఒక ఎకరానికి పిచికారి చేయాలన్నారు. జెమినీ వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు, తెల్లదోమ నివారణకు ఎస్టామీ ప్రైడ్ 10 గ్రాములు ఒక ట్యాంక్‌కు వేప నూనె 20 ఎం.ఎల్. మిశ్రమంతో పిచికారీ చేయాలన్నారు. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గడం వల్ల ఆకుమచ్చ తెగులు, బూడిద తెగులు ఆశించే అవకాశం ఉందని తెలిపారు. వీటి నివారణకు కార్బ డైజిమ్ ఒక గ్రాము లీటర్ నీటికి లేదా మాంకోజెబ్ 2 గ్రాములు లీటర్ నీటి మిశ్రమంతో పిచికారీ చేయాలని సూచించారు. బూడిద తెగులు నివారణకు మైక్లోబుటానిల్ తెగులు మందును 1.5గ్రాములు లీటరు నీటిలో పిచికారీ చేయాలన్నారు. వాతావరణం చల్లగా ఉండటం వల్ల రసం పీల్చే పురుగుల ఉధృతి కూడా పెరిగే అవకాశం ఉన్నందున వాటి నివారణకు పిప్రోనిల్ 2 మి.లీ. లీటరు నీటికి లేదా అసిటామప్రిడ్ 1 గ్రాము లీటరు నీటికి లేదా స్పైరోమేసిఫిన్ 1మి.లీ. లీటరు నీటికి చొప్పున కలుపుకొని పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు ఎం.గురునాథం, వాగ్యానాయక్, రైతులు పాల్గొన్నారు.

నేడు పోట్లూరులో గోదాం ప్రారంభోత్సవం

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామంలో నూతనంగా రూ.43 లక్షల వ్యయంతో నిర్మించిన రైతులు పండించిన పంటలు నిల్వ ఉంచేందుకు ఏర్పాటు చేసిన గోదాం నేడు ప్రారంభించనున్నారు. ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు శావల్యాపురం వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ నాగులపాటి చెన్నయ్య పాల్గొంటారని సొసైటీ సీఈవో జాలాది నాగప్రసాదు శనివారం తెలిపారు.

నేడు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు వేల్పూరు రాక

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో జలజీవన్‌మిషన్ పథకం పనుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొంటారని ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్ శనివారం తెలిపారు. రూ. కోటి రూపాయల వ్యయంతో చేపట్టిన ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో ఏర్పాటు చేసిన 700 ఇంటింటి నీటి కుళాయిలు ప్రారంభోత్సవ కార్యక్రమం ఉదయం 11 గంటలకు జరుగుతుందన్నారు. ఆయనతో పాటు సర్పంచ్ బీర్నేడి రత్నగిరి, గ్రామపార్టీ అధ్యక్షులు తూమాటి కబ్బారావు,సొసైటి అధ్యక్షులు నాగులపాటి చెన్నయ్య, స్వర్ణాల వెంకటరావు, రాఘవరావు ఉన్నారు.

ఘనంగా వార్షికోత్సవం

నాదెండ్ల: చిలకలూరిపేట నూతన మార్కెట్ యార్డు సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న షిర్డీ సాయిబాబా సేవాశ్రమం వార్షికోత్సవం వైభవంగా జరిగింది. ఉదయాన్నే బాబాను ప్రత్యేకంగా అలంకరించి కాగడ హారతి, సుప్రభాత సేవ, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఉచిత సామూహిక సాయి సత్యవ్రతాలు నిర్వహించారు. విరాట్ సాయి స్తోత్రం పఠించారు. అనంతరం బాబాకు చందనోత్సవం, మధ్యాహ్నం హారతి, సాయంత్రం 3 గంటలకు బాబాకు గ్రామోత్సవం, పల్లకీ సేవ నిర్వహించారు. భక్తి గీతాలాపన, భజనలు నిర్వహించారు. రాత్రి సంధ్యాహారతి నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ అధ్యక్షుడు యూవీ శివరామయ్య, కార్యదర్శి శిఖాకొల్లి పాపారావు, ట్రస్టీ ఎం.సామ్రాజ్యం, సభ్యులు పర్యవేక్షించారు.

రామాలయంలో చోరీ

రొంపిచర్ల: మండలంలో సుబ్బయ్యపాలెం గ్రామంలో గల కోదండరామస్వామి ఆలయంలో చోరీ జరిగిన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. శుక్రవారం అర్ధరాత్రి ఈ సంఘటన జరిగి ఉండవచ్చునని గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలో గల శ్రీ కోదండరామస్వామి ఆలయంలోకి వెళ్లిన గ్రామస్తులకు హుండీ కనబడకపోవటంతో చోరీ జరిగిందని గుర్తించారు. గుర్తుతెలియని వ్యక్తులు గుడిలో ఉన్న హుండీని తీసుకెళ్లిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని దర్యాప్తు ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

వెల్దుర్తి: వేగంగా వెళ్తున్న ఆటో బోల్తా కొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని గుండ్లపాడు, కండ్లకుంట గ్రామాల మధ్య శనివారం జరిగింది. గుండ్లపాడు గ్రామానికి చెందిన కంభంపాటి చిన ఏసోబు (45) గేదెల వ్యాపారం నిమిత్తం కండ్లకుంట గ్రామానికి వెళ్లి స్వగ్రామానికి ఆటో ఎక్కి తిరిగి వస్తుండగా ఆటో బోల్తా పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు చిన ఏసోబుకు భార్య, పిల్లలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీహరి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మాచర్ల ప్రభుత్వాసుపత్రికి పంపినట్లు తెలిపారు.

స్టడీ మెటీరియల్ అందజేత



వినుకొండలోని నిర్మలా ఇంగ్లిష్‌మీడియం పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు అబిల్ కలాం థెరిస్సా సేవా సంఘం వ్యవస్థాపకురాలు చందోలు నాగవాణి ఆధ్వర్యంలో స్టడీమెటీరియల్‌ను అందజేశారు. పరీక్షల సమయం నేపథ్యంలో విద్యార్థులంతా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలనా ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాణిగోవింద్, సిబ్బంది పాల్గొన్నారు.

–వినుకొండ(నూజెండ్ల)

సాకారం చేద్దాం



నాదెండ్ల:పాఠశాలలో శనివారం మై ఛాయిస్ ఫౌండేషన్ సహకారంతో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో సురక్షిత గ్రామ జ్యోతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ల్యాంప్ సంస్థ కోఆర్డినేటర్ కొండపల్లి వెంకటేశ్వరరావు, సంస్థ ట్రైనీ కోఆర్డినేటర్ షేక్ బాజీ పాల్గొన్నారు. హెచ్‌ఎం కృష్ణానాయక్ మాట్లాడుతూ, క్రమశిక్షణ కలిగిన భావిభారత పౌరులుగా తీర్చిదిద్దేందుకు జీవితంలో ప్రతి ఒక్కరూ నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని కొనసాగాలన్నారు. అనంతరం కామిక్ బుక్స్‌ను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు.

–నాదెండ్ల

అవగాహన ఏర్పరచుకోండి



జాతీయ రహదారి భద్రతావారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రమైన శావల్యాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. వినుకొండ రూరల్ సీఐ సుధాకర్ పాల్గొని రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ చల్లా సురేష్, ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, బెజవాడ నాగేశ్వరరావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

– శావల్యాపురం

స్వచ్ఛమైన నీరు



ప్రతి గ్రామానికి స్వచ్ఛమైన తాగునీటిని అందిస్తామని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని సరికొండ పాలెం గ్రామంలో బాల వికాసం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ నిధులతో నీటి శుద్ధికరణ పథకం ప్రారంభోత్సవం శనివారం నిర్వహించారు. ప్రతి గ్రామంలో ప్రతి పౌరుడు స్వచ్ఛమైన శుద్ధ జలం అందే విధంగా రానున్న రోజుల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఒంగోలు సుబ్బారావు, ఎంపీటీసీ ఎస్.వెంకట రమణ, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

–బొల్లాపల్లి

పార్లమెంటులో విజయకేతనం ఎగురవేస్తాం

- గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనీల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే గోపిరెడ్డి
- జొన్నలగడ్డలో ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు



జొన్నలగడ్డలో పాల్గొన్న ప్రజలకు నమస్కరిస్తున్న ఎమ్మెల్యే గోపిరెడ్డి, ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనీల్ కుమార్ యాదవ్

నరసరావుపేట: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలతో వచ్చే ఎన్నికల్లో పార్లమెంటు నియోజక వర్గంలోని ఎంపీ స్థానంతో పాటు ఏడు ఎమ్మెల్యే స్థానాలను వైఎస్సార్‌సీపీ గెల్చుకుంటుందని ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనీల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిలు స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం జొన్నలగడ్డ గ్రామంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఇరువురూ పాల్గొన్నారు. గ్రామస్తులు పూలు చల్లుతూ బాణాసంచాలు కాల్చి ఎదురేగి ఘన స్వాగతం పలికారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. గ్రామంలోని డ్వాక్రా మహిళలతో ప్రత్యేక సమావేశమై వారికి జరిగిన రుణమాఫీ గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి డాక్టర్ అనీల్ మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసేందుకే సీఎం జగన్ గడపగడప కార్యక్రమం చేపట్టారన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ గ్రామంలో రూ.28.25 కోట్లతో అభివృద్ధి, సంక్షేమం చేశామన్నారు. సచివాలయం, హెల్త్ క్లినిక్, ఆర్‌బీకే, సీసీరోడ్లు నిర్మించి ప్రారంభించుకున్నామన్నారు. మంచినీటి చెరువును అభివృద్ధి చేశామన్నారు. విద్యుత్ పోల్స్‌ను మార్చామని, జలజీవన్ మిషన్ కింద రూ.70 లక్షలు ఇంటింటికి తాగునీరు అందజేస్తున్నామన్నారు. కాలనీలో రూ.50 లక్షలతో సీసీరోడ్లు, డ్రెయిన్లు అభివృద్ధి చేశామన్నారు. జలజీవన్ మిషన్ కింద కాలనీలో రూ.36 లక్షలతో స్వచ్ఛమైన తాగునీరు అందజేస్తామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండుకళ్లుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో వందకు 86 కుటుంబాలకు సీఎం జగన్ లబ్ధిచేకూర్చారన్నారు. విద్యార్థుల భవిష్యత్ కోసం నాడు-నేడుతో ప్రభుత్వ పాఠశాలను ఆధునీకరించారని, ప్రభుత్వ వైద్యశాలలను అభివృద్ధి చేశారన్నారు. అన్నీ వర్గాలకు చెందిన ప్రజలకు మేలు చేయటమే ధ్యేయంగా సీఎం జగన్ సుపరిపాలన సాగిస్తున్నారని వివరించారు.

తన వలన మేలు జరిగితేనే వచ్చే ఎన్నికల్లో ఓటేయండని ధైర్యంగా చెబుతున్న ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. చంద్రబాబు 14 ఏళ్లపాటు సీఎంగా పనిచేసినా చెప్పుకునేందుకు ఏమీలేదని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మోరబోయిన శ్రీనివాసరావు, గ్రామ సర్పంచు కుందా చిన్న, ఉపసర్పంచు శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీ సోనియా, మాజీ ఎంపీటీసీ పోతిరెడ్డి శివారెడ్డి, మాజీ సర్పంచు దొండేటి అప్పిరెడ్డి, రాష్ట్ర మైనార్టీసెల్ కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా, హాలీవుడ్ రఘు, గోరంట్ల గోవిందుయాదవ్, గాయం రామిరెడ్డి, ఏరువ హనిమిరెడ్డి, ఏరువ చంద్రమౌళి రెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.



డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న నేతలు

ప్రతి ఒక్కరికీ వంద రోజుల పని కల్పించాలి

డ్వామా పీడీ జి.జోసఫ్ కుమార్

బొల్లాపల్లి: వంద రోజుల పనిదినాలు ప్రతి ఒక్క ఒక్కరికీ కల్పించాలని డ్వామా పీడీ జి.జోసఫ్ కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద 15వ విడత సోషల్ ఆడిట్ ప్రజావేదిక శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ జి.జోసఫ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ప్రజావేదికలో సామాజిక తనిఖీ వివరాలు వెల్లడించారు. పీడీ మాట్లాడుతూ మండలంలో 11 వేలు జాబ్ కార్డులున్నాయని, వీరిలో 609 జాబ్ కార్డులకు మాత్రమే వంద రోజులు పనిదినాలు పూర్తి చేశారని వివరించారు. సామాజిక తనిఖీలో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరి పని కల్పించాలని నివేదిక వెల్లడైందని తెలియజేశారు, పేదల మండలంలో వలసల నివారణకు పనులు కల్పించాలని సూచించారు. క్షేత్ర సహాయకులు సచివాయల కేంద్రాల్లో హాజరు కావాలని, వారంలో ఒక రోజు ప్రతి శుక్ర వారం కూలీలతో సమావేశం ఏర్పాటు చేసి గ్రామాల్లో తగిన పనులకు శ్రీకారం చుట్టాలన్నారు. సామాజిక తనిఖీల్లో 23 పంచాయతీల్లో 509 పనుల్లో రూ 8.99 కోట్ల మేర పనులు జరిగాయని తెలిపారు. ఈ ప్రజావేదికలో రూ.16 లక్షలకు ఉద్యాన పంటలకు నాటిన మొక్కలు కనిపించ లేదని, ఆయా పొలంలో పత్తి, మిరప, పొగాకు వంటి పంటలు సాగు చేసినట్లు తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి విచారణకు పీడీ ఆదేశించారు. తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఉపాధిహామీ పథకం పనుల కొలతల్లో తేడాలకు గాను రూ.50 వేలు మస్టర్ షీట్స్‌లో రూ.20 వేలు తేడాలు గుర్తించి మొత్తం రూ.70 వేలు రికవరీ చేయాలని పీడీ వెల్లడించారు. ప్రజావేదికలో జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మీ, ఏపీడీ ఈ బూసిరెడ్డి, అంబుడ్స్‌మెన్ అధికారి ఎస్‌కె మీరావలి, ఈఓపీఆర్డీ ఎస్‌కె జిలానీ బాషా, ఎస్సార్పీ టీ వెంకటేశ్వరరావు, ఏపీవో జి.ఎస్.అంజనేయరాజు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నరసరావుపేట, రొంపిచర్ల మండల కమిటీ మెంబర్లు వీరే

నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నరసరావుపేట, రొంపిచర్ల మండల కమిటీలను పార్టీ కేంద్ర కార్యాలయం శనివారం ప్రకటించింది. ఈ మేరకు నరసరావుపేట మండల అధ్యక్షులుగా తన్నీరు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా టి.రామాంజనేయులు, ఎం.శివారెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా యర్రయ్య, పొన్నపాటి విజయకృష్ణారెడ్డి, ఎస్.శివారెడ్డి, కార్యదర్శులుగా కామిరెడ్డి నాగిరెడ్డి, కొప్పుబాబు, జొన్నలగడ్డ అచ్చిబాబు, రేపూరి నాగేశ్వరరావు, వి.జాన్, కోశాధికారిగా వి.వెంకట కోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా అంజి, చింతా రాంబాబు, రోశయ్య, జక్కిరెడ్డి సాంబిరెడ్డి, కె.చెన్నయ్య, మాదినేని వాసు, చిన్నఖాజానయాబు, సుధాకరరెడ్డి, వెంపరాల వెంకటేశ్వర్లు, పి.సుబ్బారావు, పూలూరు శ్రీను, ఉయ్యాల వెంకట మల్లికార్జునరావు, డేవిడ్, రామకోటి, కుంబాల శ్రీనివాసరావు నియమితులయ్యారు.

రొంపిచర్ల మండల కమిటీ అధ్యక్షులుగా శ్రీనివాసరెడ్డి

అధ్యక్షులుగా కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షులుగా పానుగోటి వెంకటరావు, బందెల వెంకటరావు, ప్రధాన కార్యదర్శులుగా పల్లపు అంజయ్య, అన్నెం పున్నారెడ్డి, షేక్ సైదా, కార్యదర్శులుగా మానుకొండ వాసుదేవరెడ్డి, ఒట్టికొండ ఆంజనేయులు, గాడిపర్తి సీతయ్య, ఇగుటూరి రంగారెడ్డి, కల్లి వెంకటరెడ్డి, కోశాధికారిగా కాశినీడి మస్తానయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా కొండ్రముట్ల శేషయ్య, వెంకట రామయ్య, గాజుల మాణిక్యం, గోపు నాగిరెడ్డి, చింతగుంట శ్రీనివాసరెడ్డి, పోతుమంచి రాధాకృష్ణ, హంసావతు నరసింహ నాయక్, రాజనాల నాగిరెడ్డి, బత్తుల వెంకటేశ్వర రావు, గొట్టిపాటి శ్రీనివాసరావు, మేడబలిమి సూరి, బొబ్బిలి కోటిరెడ్డి, కామినేని ఆదెయ్య, ఉన్నం శ్రీనివాసరావు, కొణతం శ్రీనివాసరావులను నియమించారు.

న్యాయ విభాగ సెక్రటరీ కర్నాటికి సత్కారం



చెన్నకేశవరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, న్యాయవాదులు

వినుకొండ(నూజెండ్ల): రాష్ట్ర వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ న్యాయవిభాగం సెక్రటరీగా ప్రముఖ న్యాయవాది కర్నాటి చెన్నకేశవరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో న్యాయవాది చెన్నకేశవ రెడ్డిని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఘనంగా సత్కరించారు. పార్టీ కోసం శ్రమించే వారిని పార్టీ ఎప్పుడూ గుర్తిస్తుందని, నాపై నమ్మకంతో నాకు కేటాయించిన ఈ పదవి ద్వారా నిత్యం పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉండి వారికి చట్టపరమైన సేవలు అందిస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, లీగల్ సెల్ నాయకులు ఆరెకూటి శ్రీనివాస్‌రెడ్డి, ఎం.మనోహర్ రెడ్డి పోలూరి వెంకటరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ సీనియర్ న్యాయవాది పార్టీకి నిత్యం సేవలందిస్తున్న చెన్నకేశవరెడ్డి లాంటి వారికి పెద్ద పదవి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్. వీరాంజనేయ చౌదరి, సెక్రటరీ కె.హనుమంతరావు, ఏజీపీ ఎం.ఎస్. ప్రసాద్, న్యాయవాదులు జి.సురేష్ కుమార్, దగ్గుపాటి విజయ్, ఎం.ఎలీషాబాబు, గౌస్ మొహుద్దీన్, ఎం.అశోక్‌బాబు, జెట్టి తిరుపతిరావు, శేఖర్ బాబు, సోమశేఖర్, దూల నాగరాజు, మల్లికార్జున రెడ్డి, శ్రీనివాసరెడ్డి, బాబు, రామాంజి, సోమిరెడ్డి, ఆర్.సామ్రాజ్యం, రెడ్డి నాగపద్మ తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లో చౌక్‌బాల్ పోటీలు

చిలకలూరిపేటటౌన్: ఏపీ చౌక్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో జూన్ నెలలో జాతీయ స్థాయి చౌక్‌బాల్ పోటీల నిర్వహణకు అనుమతి కోసం చౌక్‌బాల్ ఇండియాకు దరఖాస్తు చేశామని అసోసియేషన్ చైర్మన్, కార్యదర్శి చేబ్రోలు మహేష్, ఎస్ సుధాకర్ తెలిపారు. ఈ జాతీయ స్థాయి పోటీల్లో దేశ నలుమూలల నుంచి 28 రాష్ట్రాల టీంలు పాల్గొననున్నట్లు చెప్పారు.

పాఠశాలలో ఎంఈవో తనిఖీ



శావల్యాపురం: మండల కేంద్రమైన శావల్యాపురం మండల పరిషత్ పాఠశాలను ఎంఈవో సాంబశివరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను, పాఠశాల రికార్డులను, మధ్యాహ్న భోజన అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం లెసెన్ ప్లాన్‌లు, టీచింగ్ డైరీ, విద్యార్థుల హాజరు పట్టికలు క్రమం తప్పకుండా నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినీ లలితకుమారి ఉన్నారు.

బాల్య వివాహం సాంఘిక దురాచారం

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు పద్మావతి
- నాదెండ్లలో బేటీ బచావో – బేటీ పడావో



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కమిషన్ సభ్యులు పద్మావతి

నాదెండ్ల: బాల్య వివాహాలు సాంఘిక దురాచారమని, బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి చెప్పారు. మండల కేంద్రమైన నాదెండ్ల సీడీపీవో కార్యాలయంలో శనివారం బేటీ బచావో-బేటీ పఢావో కార్యక్రమాన్ని నిర్వహించారు. సీడీపీవో శాంతకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పద్మావతి మాట్లాడుతూ, ఇప్పటికీ బాల్య వివాహాలు జరుగుతుండటం శోచనీయమన్నారు. 18 ఏళ్ల లోపు బాలికలను వివాహం చేసుకునే వరునికి 10 ఏళ్ల జైలు శిక్ష, అలాంటి వివాహాలు చేసే వారిపై, ప్రోత్సహించే వారిపై, వివాహాలకు హాజరయ్యే వారిపై సైతం చట్టప్రకారం కేసులు నమోదు తప్పవన్నారు.

దేశజనాభాలో లింగ నిష్పత్తి వ్యత్యాసం తీవ్రంగా ఉందని, భ్రూణహత్యల కారణంగా ప్రస్తుత జనాభాలో స్త్రీల సంఖ్య పురుషులకన్నా తక్కువగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం బాలికల సంక్షేమం, విద్య కోసం బేటీ బచావో-బేటీ పడావో పథకం ప్రవేశపెట్టిందన్నారు. 2015లో హర్యానాలోని పానిపట్‌లో వంద కోట్ల నిధుల కేటాయింపుతో పథకం ప్రారంభమైందన్నారు. ఈ పథకం పొందేందుకు పదేళ్ళకన్నా తక్కువ వయస్సు గల ఆడపిల్లలు అర్హులన్నారు. సమీప బ్యాంకు, పోస్టాఫీసుల్లో సంప్రదించి పథకంలో నమోదు చేయించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాట్రగడ్డ మస్తాన్‌రావు, ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్, తహశీల్దార్ డీవీబీ వరకుమార్, నాదెండ్ల, గణపవరం సొసైటీల ఛైర్మన్లు కురుకుంట్ల వెంకటరెడ్డి, మంగు ఏడుకొండలు, నాదెండ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జ్ఞానేశ్వరి, ఎంఈవో కృష్ణారెడ్డి, ఏసీడీపీవో నిర్మలారాణి, సూపర్‌వైజర్లు నిర్మలాకృష్ణమాల, పద్మ, ఉష, విజయకుమారి, ఎంఎస్‌కేలు, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీలు, పంచాయతీ కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

సాతులూరు వలంటీర్లకు సన్మానం



సాతులూరులో ఎంపికైన వలంటీర్లను సన్మానిస్తున్న పంచాయతీ అధికారులు

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో పనిచేస్తున్న వలంటీర్లను శనివారం గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ నెల 15న ఫిరంగిపురంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకున్న విషయం విదితమే. నాదెండ్ల మండలంలో షేక్ నాగుల్‌మీరా (సాతులూరు), దేశిరెడ్డి ఇందిర (చిరుమామిళ్ల) దారెడ్డి సీతమ్మ (గొరిజవోలు) గుడికందుల కోమలి (నాదెండ్ల–2)లు సేవ వజ్ర అవార్డులు, మూసా మజీదు (సాతులూరు–1) సేవా రత్న అందుకున్నారు. వీరికి ఒక్కొక్కరికీ రూ.45 వేలు నగదు బహుమతి, మెమెంటోలు అందుకున్నారు. వీరిలో మూసా మజీదుకు వరుసగా రెండోసారి ఎంపికవడం విశేషం. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు గద్దె కోటేశ్వర రావు మాట్లాడుతూ వలంటీర్లు అత్యుత్తమ సేవలు అందించినందుకు ప్రభుత్వం నుంచి అవార్డులు అందుకోవటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బండారు శ్రీవర ప్రతాప్, పంచాయతీ కార్యదర్శులు రాఘవయ్య, రమేష్, గద్దె ఆంజనేయులు, రావుల శ్రీనివాసరావు, పాటిబండ్ల రాజేశ్వరి, శేఖర్, సీతయ్య, బాజీ, మహబూబ్‌బీ, జాన్‌పీరా, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

వివాహిత మృతి

ఇరుకుపాలెం(ముప్పాళ్ళ): అనారోగ్య సమస్యల కారణంగా వివాహిత పురుగు మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలోని ఇరుకుపాలెం గ్రామంలో శనివారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన సూరిపోగు నిర్మల(45) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆరోగ్య సమస్యను తట్టుకోలేక పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ఇది గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు ఆమెను తరలించారు. మెరుగైన చికిత్స కోసం గుంటూరు జీజీహెచ్‌లో చేర్పించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారుజామున నిర్మల మృతి చెందింది.

అందరి ఆశయాలను నెరవేర్చాలి



యడ్లపాడు: ప్రాథమిక దశ నుంచే విద్యార్థులు చక్కని క్రమశిక్షణ విద్యపట్ల ఇష్టత పెంచుకోవాలని విజయవాడ డివిజనల్ ఇంజినీర్ (సిగ్నల్స్ విభాగం) జామక్లముడి జాన్ పేర్కొన్నారు. మండలంలోని చెంఘీజ్‌ఖాన్‌పేట ప్రాథమికోన్నత పాఠశాల పూర్వ విద్యార్థి అయిన జాన్ శనివారం త్వరలో పరీక్షలు రానున్న నేపథ్యంలో విద్యార్థులకు మోటివేషన్ క్లాసులను శనివారం నిర్వహించారు. నిరుపేద కుటుంబంలో పుట్టిన తాను ఎలాంటి వసతులు, ఆర్థిక వనరులు లేకండా ఎంతో కష్టపడి చదవి, ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించినట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మనబడి నాడు-నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి, కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు కల్పించి విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. విద్యార్థులు ఆయా వసతుల్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ లక్ష్యాన్ని, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కేవీ శంకర్, ఉపాధ్యాయులు షేక్ గౌస్‌బాష, సునీత, పీఎం చైర్మన్ ఆంజనేయులు పాల్గొన్నారు.

ప్రకృతి సాగుతో పెట్టుబడి తక్కువ

- వాటి ఉత్పత్తులతో చక్కని ఆరోగ్యం
- ఎంపీపీ పిడతల ఝాన్సీ

యడ్లపాడు: జిల్లాలోనే యడ్లపాడు మండల రైతు ఉత్పాదక సహకార సంఘం (ఎఫ్‌పీవో) ప్రథమ స్థానంలో ఉందని ఎంపీపీ పిడతల ఝాన్సీ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఫార్మర్స్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఆరో సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పురుగు మందుల్లేని స్వచ్ఛమైన పంటలు పండించి అందరూ ఆరోగ్యంగా ఉండేందుకు ఎఫ్‌పీవో రైతులు కృషి చేయాలని కోరారు. ఏవో సీహెచ్ సరిత మాట్లాడుతూ సాగురంగంలో సాంకేతిక పరిజ్ఞానంతో పెట్టుబడి తగ్గించుకుని లాభాలు పొందొచ్చని తెలిపారు. కూలీల అవసరం లేకుండా మందుల్ని డ్రోన్ ద్వారా పిచికారీ చేసుకోవచ్చన్నారు. ఇందుకు ప్రభుత్వం సబ్సిడీ ఇచ్చి రైతుల్ని ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించే విషయంలో వ్యవసాయశాఖ అధికారులు పూర్తిగా సహకారం ఇస్తుందన్నారు. ఏపీఎం జీవన్ మాట్లాడుతూ ఎఫ్‌పీవో బిజినెస్ ఫండ్ రూ.35 లక్షలు ఆరుసార్లు రొటేషన్ చేసిందన్నారు. రూ.2 కోట్ల టర్నోవర్‌తో రూ.21 లక్షల ఆదాయాన్ని పొందినట్లు వెల్లడించారు. ఈ ఏడాది రూ.7,75,669 ఎఫ్‌పీఓ ఆడిట్ 2023–24 నివేదికను సర్వసభ్య సమావేశం ఆమోదించింది. ఉపాధి పథకం టీఏ మాధవీ పండ్లతోటల సాగుపై అవగాహన, పథకం ద్వారా అందించే రాయితీని తెలియజేశారు. ఉన్నవ గ్రామమహిళా రైతు కోటేశ్వరమ్మ మిర్చి, శనగ పంటల ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, వాటి ప్రయోజనాలపై వివరించారు. కార్యక్రమంలో డీపీఎం పి శ్రీనివాస్, ఎఫ్‌పీవో ప్రతినిధులు పూర్ణచంద్ర రావు, కోశాధికారి చిన్నవీరయ్య, ఎఫ్‌పీవో సీసీలు బి.హేమలత, నాగేశ్వరావు, పేరమ్మ, వీవోలు పాల్గొన్నారు.

కారు ఢీకొని ఉపాధ్యాయుడికి గాయాలు



నాదెండ్ల: బైక్‌ను కారు ఢీకొని ఓ ఉపాధ్యాయుడు గాయపడిన సంఘటన జాతీయ రహదారి గణపవరం ప్రసన్నవంశీ స్పిన్నింగ్‌మిల్లు సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. యడ్లపాడు మండలం, మైదవోలుకు చెందిన నక్కా శ్రీనివాసరావు ఓ స్కూల్లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పని చేస్తుంటాడు. తన ద్విచక్రవాహనంతో చిలకలూరిపేట వెళ్తుండగా, ప్రసన్నవంశీ స్పిన్నింగ్ మిల్లు వద్దకు రాగానే యూటర్న్ తీసుకుంటుండగా, చిలకలూరిపేట నుంచి గుంటూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో ఉపాధ్యాయుడికి గాయాలయ్యాయి.